క్లుప్తంగా

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా సుబ్రహ్మణ్యం



రుద్రవరం: మండల ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ ప్రమోద్ నంద్యాల ప్రాజెక్టుకు బదిలీ అయ్యారు. ఉన్నతాధికారులు ఆయన స్థానంలో కొలిమిగుండ్ల మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రహ్మణ్యంను నియమించారు. దీంతో గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

క్షేత్ర సందర్శనకు ఏపీ మోడల్ విద్యార్థులు



రైతు సేవా కేంద్రం వద్ద విద్యార్థులు

రుద్రవరం: మండల పరిధిలోని తువ్వపల్లె తిప్పమీదున్న ఏపీ మోడల్ పాఠశాల, కళాశాల విద్యార్థులు గురువారం క్షేత్ర సందర్శనలో భాగంగా రుద్రవరంలోని రైతు సేవా, మీ సేవ కేంద్రం, విజయ డెయిరీ బ్రాంచ్‌ల వద్దకు వెళ్లారు. మీ సేవ వద్ద ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ చేసే విధానంతో పాటు సర్టిఫికెట్లు, బ్యాంకు లావాదేవీలపై అవగాహన కల్పించారు. రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ పద్ధతులు, మందులు, ఆధునిక పరికరాలకు గురించి ఏఓ శ్రీకృష్ణ వివరించారు. ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు, ఒకేషనల్ ట్రైనర్ జ్యోతి ప్రియ తదితరులు పాల్గొన్నారు.

540 యూరియా బస్తాలు సీజ్



యూరియా బస్తాలను సీజ్ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

శిరివెళ్ల: యర్రగుంట్లలో గురువారం ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. శ్రీశ్రీ ఏజెన్సీస్ ఎరువుల దుకాణంలో ఎమ్మార్పీ కన్నా ఎరువులను అధిక ధరలో అమ్ముతున్నారని రైతుల ఫిర్యాదుల మేరకు విజిలెన్స్ అధికారి రూపస్ రోనాల్డ్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు జరిపారు. ఈ దాడుల్లో దుకాణ గోడౌన్‌లోని రూ. 1.43 లక్షల విలువ చేసే 540 యూరియా బస్తాలను సీజ్ చేశారు. అలాగే మరో దుకాణంలో ఈ- పాస్, గోడౌన్‌లోని ఎరువుల నిల్వలలో వ్యత్యాసం రావడంతో రూ.9.98 లక్షల విలువ చేసే ఎరువులను నాట్ సేల్ కింద ప్రకటించారు. దాడుల్లో ఏఓ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుదాం



హెడ్ పోస్టాఫీస్ ఆవరణలో మొక్క నాటుతున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి పర్యావణాన్ని కాపాడాలని పోస్టల్ శాఖ కర్నూలు రీజియన్ పీఎంజీ వెన్నం ఉపేందర్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక హెడ్ పోస్టాఫీస్‌ను తనిఖీ చేసి అధికారులు, సిబ్బందికి సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం ఇటీవల మరణించిన పాలసీదారుడి కుటుంబ సభ్యులకు రూ.5.10 లక్షల చెక్కు అందజేశారు. పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు, విజయానంద్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మను ఆదర్శంగా తీసుకుందాం



ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా రజాకార్లు, బ్రిటీష్ పాలకులను ఎదిరించిన చాకలి ఐలమ్మను ఆదర్శంగా తీసుకుందామని రజక సంఘం జిల్లా అధ్యక్షుడు జిల్లెల్ల శ్రీరాములు అన్నారు. పట్టణంలోని సంఘం కార్యాలయంలో గురువారం చాకలి ఐలమ్మ 129వ జయంతిని పురస్కరించుకొని రజక సంఘం నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శ్రీరాములు మాట్లాడుతూ రజాకార్లను ఎదిరించి వేల కుటుంబాలకు అండగా నిలిచిన ఐలమ్మ చరిత్రలో నిలిచి పోయిందన్నారు. మద్దిలేటి, సంజీవరాయుడు, శ్రీదేవి, కానాల నాగరాజు, జంబులయ్య, తిరుపాలు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

హెచ్‌ఎంల సమావేశం

ఆత్మకూరు: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలతో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సమావేశం నిర్వహించారు. ఎంఈఓ-1 బాలాజీనాయక్, ఎంఈఓ-2 సురేష్ హాజరై మాట్లాడారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. యూడైస్ ప్లస్ ఎంట్రీ పూర్తి చేయాలన్నారు. స్వర్ణాంధ్ర-2047పై ఎస్ఏ, డిబేట్ పోటీలను కాంప్లెక్స్ స్థాయిలో గెలిచిన వారికి మండలస్థాయి పోటీలకు పంపాలని హెచ్‌ఎంలను ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

కొనసాగిస్తారా.. రోడ్డున పడేస్తారా?

- నూతన మద్యం పాలసీతో ఇబ్బందులు
- ఆందోళనలో మద్యం షాపుల ఉద్యోగులు



గోస్పాడులో ఏర్పాటు చేసిన ప్రభుత్వ మద్యం దుకాణం

గోస్పాడు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో స్థానికులకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో నూతన మద్యం పాలసీలో కొందరికి ఉద్యోగాలు కల్పించారు. అయితే ఆ ఉద్యోగాలకు ప్రస్తుత ప్రభుత్వం ఎసరు పెట్టింది. అక్టోబర్ ఒకటి నుంచి నూతన మద్యం పాలసీని అమలు చేయనున్నామనే ప్రకటనతో మద్యం దుకాణాల్లో పనిచేసే ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. గత ప్రభుత్వం మద్యం దుకాణాల్లో అక్రమాల కట్టడికి, బెల్టు షాపుల నియంత్రణకు ఉద్యోగులను నియమించి ప్రభుత్వం పర్యవేక్షణలోనే మద్యం విక్రయాలు నిర్వహించింది. ఈ క్రమంలో పలువురు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించింది. సూపర్‌వైజర్, సేల్స్‌మెన్, నైట్ వాచ్‌మన్ వంటి ఉద్యోగాలు ఇచ్చింది. ఒక్కో షాపులో నలుగురు నుంచి ఐదుగురికి ఉపాధి కల్పించింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మద్యం దుకాణాలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు సిద్ధమవుతుండడంతో తమ భవిష్యత్ ఏమిటని వారు దిగులు చెందుతున్నారు.

మద్యం దుకాణాలతో నిరుద్యోగులకు ఉపాధి..

2019కి ముందు ఉన్న మద్యం దుకాణాలకు ప్రతి రెండేళ్లకోసారి టెండర్లు పిలిచేవారు. లాటరీ పద్ధతిలో దుకాణాలను కేటాయించేవారు. కొన్ని ముఖ్యమైన మద్యం దుకాణాలకు డిమాండ్ ఉండేది. ప్రైవేటు దోపిడీని అరికట్టేందుకు 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అవినీతి అక్రమాలకు చెక్ పెట్టి పలువురు నిరుద్యోగులకు ఉపాధి కల్పించింది. మండలంలోని మూడు గ్రామాల్లో మద్యం షాపులను ఏర్పాటు చేశారు. జిల్లాలో మొత్తం 93 దుకాణాలుండగా.. వీటి ద్వారా ఒక్కో షాపులో ఒక సూపర్‌వైజర్, ఇద్దరు సెల్స్‌మెన్, ఇద్దరు నైట్ వాచ్‌మెన్‌ల చొప్పున నియమించారు. నంద్యాల, ఆళ్లగడ్డ, డోన్, బనగానపల్లె, నందికొట్కూరు, డోన్‌లలో ఒక్కొక్కరు మాత్రమ నైట్‌వాచ్‌మన్‌లు ఉంటారు. పట్టణాల్లోని 26 దుకాణాల్లో ఒక నైట్ వాచ్‌మెన్, ఒక సూపర్‌వేజర్, ముగ్గురు సేల్సమెన్‌లు ఉంటున్నారు. 67 షాపుల్లో ఒక సూపర్‌వైజర్, ఇద్దరు సెల్స్‌మెన్, ఇద్దరు నైట్ వాచ్‌మెన్‌ల చొప్పున పనిచేస్తున్నారు. నాడు ప్రత్యేకంగా ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చి ఇంటర్వ్యూలు చేపట్టి, సర్టిఫికెట్ వెరిఫికేషన్ల ద్వారా నియామకాలు చేపట్టింది. సూపర్‌వైజరుకు నెలకు రూ.21,500, సేల్స్‌మెన్‌కు రూ.19,500, నైట్ వాచ్‌మన్‌కు రూ.10,600 వేతనం ఇస్తున్నారు. కూటమి ప్రభుత్వ నూతన మద్యం పాలసీతో.. న్న ఉద్యోగాలు కోల్పోయి రోడ్డున పడాల్సివస్తుందోననే ఆందోళన చెందుతుతున్నారు. ప్రభుత్వం తెచ్చే నూతన మద్యం పాలసీలో భాగంగా ప్రభుత్వ దుకాణాలను తొలగించి గతంలో మాదిరిగా ప్రైవేట్ దుకాణాలు ఏర్పాటు చేయనున్నారని తెలుస్తోంది. దీంతో ఇప్పటి నుంచే షాపులను దక్కించుకునేందుకు ఎవరికి వారు పావులు కదుపుతున్నారు. ప్రైవేట్ షాపుల విషయంలో టెండర్ల ప్రక్రియ ఎలా ఉంటుందనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు



ఆర్.పాంపల్లెలో అంగన్‌వాడీ కేంద్రంలో సమస్యలు తెలుసుకుంటున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ

ఉయ్యాలవాడ: ఆళ్లగడ్డ నియోజకవర్గం పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోనున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మురళీధర్ తెలిపారు. గురువారం మండలంలోని ఆర్.పాంపల్లె, కొండుపల్లె, నర్సిపల్లె, ఉయ్యాలవాడ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఫణీత్‌కృష్ణతో కలిసి పరిశీలించారు. ఆయా కేంద్రాలలో నెలకొన్న సమస్యలను కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. అత్యవసర పనుల్లో భాగంగా తాగునీరు, బాత్‌రూంలు, మరుగుదొడ్ల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కొండుపల్లె అంగన్‌వాడీ కేంద్రం పూర్తిగా శిథిలావస్థకు చేరిందని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్ ప్రారంభం



చాగలమర్రిలో ఐసీడీఎస్ తరుపున గర్భిణులకు సారె అందజేస్తున్న ఎమ్మెల్యే అఖిలప్రియ

ఆళ్లగడ్డ : పట్టణ శివారులోని పడకండ్లలో ఏర్పాటు చేసిన అర్బన్ హెల్త్ సెంటర్‌ను గురువారం ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ప్రారంభించారు. ప్రస్తుతం అద్దె ఇంట్లో ఏర్పాటు చేసిన హెల్త్ సెంటర్‌కు త్వరలో నూతన భవనం మంజూరు చేయిస్తానన్నారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చాగలమర్రిలో ఇది మంచి ప్రభుత్వం

చాగలమర్రి: మండల కేంద్రంలోని అజీం బ్రిలియంట్ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే అఖిలప్రియ పాల్గొన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో స్వచ్ఛ భారత్ కార్పొరేషన్ ద్వారా ముత్యాలపాడు గ్రామ పంచాయతికి రూ.6.80 లక్షల నిధులతో మంజూరైన ట్రాక్టర్‌ను ప్రారంభించారు. అలాగే ఐసీడీఎస్ తరుపున గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మహబూబ్‌దౌలా, తహసీల్దార్ రవికుమార్, ఏడీ వరప్రసాద్, ఎంఈఓలు అనురాధ, న్యామతుల్లా తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలో నెలకొన్న ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు.సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, సీపీఐ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు హాజరయ్యారు. అనంతరం మున్సిపల్ సీనియర్ అసిస్టెంట్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పట్టణంలోని 42 వార్డుల్లో సమస్యలు తాండవిస్తున్నాయన్నారు. వీధి కుక్కలు, పిల్లలు, మహిళలు, వృద్ధులపై దాడులు చేస్తున్నా, దోమల నివారణకు చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు.నందమూరినగర్, వైఎస్సార్ నగర్ ప్రాంతాలలో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. భాస్కర్, నాగరాముడు, ధనుంజయ్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, సీపీఐ గోస్పాడు మండల కార్యదర్శి హరినాథ్, సంజీవులు పాల్గొన్నారు.

లొంగిపోయిన హత్య కేసు నిందితుడు

మహానంది: సీతారామాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పసుపులేటి సుబ్బరాయుడు హత్య కేసులో ఏ-8 నిందితుడు గాజ రామసుబ్బయ్య గురువారం లొంగిపోయినట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. నిందితుడిని నంద్యాల జుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్‌కు ఆదేశించారన్నారు. కాగా సుబ్బరాయుడి హత్య కేసులో ఇప్పటి వరకు 24 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. మిగిలిన ఇద్దరి కోసం గాలిస్తున్నారు.

టెండర్లకు స్పందన కరువు

మహానంది: స్థానిక దేవస్థానంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు అవసరమైన పూలు, పూలమాలల సరఫరాతోపాటు విద్యుత్ అలంకరణ ఏర్పాటుకు టెండర్లు నిర్వహించగా స్పందన కరువైంది. ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో గురువారం సీల్డు టెండర్లు నిర్వహించారు. ముందస్తు సమాచారం లేకపోవడంతో టెండరు దారులు పెద్దగా హాజరు కాలేదు. వచ్చిన కొందరు కూడా దేవస్థానం చెల్లించే ధరలు గిట్టుబాటు కాకపోవడంతో వెనుదిరిగారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

బేతంచెర్ల: మండల పరిధిలోని సిమెంట్ నగర్ గ్రామ సమీపాన నంద్యాల రహదారిలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఆర్ కొత్తపల్లె గ్రామానికి చెందిన మనోహర్, కృష్ణ ద్విచక్రవాహనంపై నంద్యాలకు వెళ్లి తిరిగి వస్తున్నారు. సిమెంట్ నగర్ గ్రామ సమీపాన ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. కృష్ణకు కాలు విరగగా, మనోహర్ కు తీవ్రగాయాలు అయ్యాయి. బాధితులను 108 వాహనంలో బేతంచెర్ల ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం కర్నూలుకు తరలించారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

దొర్నిపాడు: ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసులు సూచించారు. తడిచెత్త, పొడి చెత్త సేకరణ కోసం మండలానికి మంజూరైన 10,760 బుట్టలను బుధవారం పంచాయతీ కార్యదర్శులకు పంపిణీ చేశారు. వీటిని కార్యదర్శులు ఇంటికి అందజేయాలన్నారు.

28న 'మన ఇల్లు- మన గౌరవం'

శిరివెళ్ల: ఈ నెల 28న మండలంలో మన ఇళ్లు- మన గౌరవం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం తెలిపారు. గురువారం స్థానిక 1వ గ్రామ సచివాలయంలో కార్యక్రమం అమలుపై సచివాలయ సిబ్బందితో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో మంజూరైన పక్కా గృహాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. 693 ఇళ్లు పునాది దశల్లోనే ఉన్నాయని, పనుల్లో వేగం పెంచేందుకు ప్రతి సచివాలయ పరిధిలోని లబ్ధిదారులతో 28న ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నిర్మాణాలు కొనగించేలా వారిని ప్రోత్సహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ నాగేశ్వర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు



ఎంపికయిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

నంద్యాల(న్యూటౌన్): ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా స్థానిక బాలచంద్ర సమతా విద్యానికేతన్‌లో విద్యార్థులకు గురువారం వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించారు.గెలుపొందిన వారికి కరస్పాండెంట్ జయలక్ష్మి బహుమతులు అందజేశారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

శిరివెళ్ల: రాజనగరం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపికయ్యారు. అండర్-14 విభాగంలో ఉషశ్రీ,, అండర్-17 విభాగంలో రెహమాన్ ఎంపికయ్యారు. ఈ నెల 25న నంద్యాల మున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో తమ విద్యార్థులు సత్తాచాటి జిల్లా జట్టుకు ఎంపికయ్యారన్నారు. అక్టోబర్‌లో ఏలూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. హెచ్‌ఎం తిరుపతిరెడ్డి, పీఈటీ విజయకుమార్, టీచర్లు విద్యార్థులను అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

శ్రీశైలంప్రాజెక్ట్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్, లైబ్రేరియన్ పోస్టులను భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్.పి.హుస్సేన్‌బాషా తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ పీజీలో 55 శాతం మార్కులు, NET, ET, Phd అర్హతలు ఉండి గెస్ట్ ఫ్యాకల్టీగా పని చేసేందుకు ఆసక్తి ఉన్న వారు అక్టోబర్ 5న ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో హాజరు కావాలన్నారు.

ఉసేన్‌స్వామి దర్గాకు పోటెత్తిన భక్తులు

కోవెలకుంట్ల: మండలంలోని రేవనూరు గ్రామంలో వెలసిన ఉసేన్‌స్వామి దర్గాకు గురువారం భక్తులు పోటెత్తారు. జిల్లాతోపాటు కర్నూలు, వైఎస్సార్, అనంతపురం, తదితర జిల్లాల నుంచి భక్తులు తరలిరావడంతో దర్గా భక్తులతో కిటకిటలాడింది. భక్తులు స్వామివారికి పూలదట్టీలు, జెండాలను ఊరేగింపుగా తీసుకొచ్చి ఫాతేహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



ఉసేన్‌స్వామి దర్గాలో ఫాతెహాలు సమర్పిస్తున్న భక్తులు

రహదారులు గుంతలమయం



శిరివెళ్ల మెట్ట- యాళ్లూరు రోడ్డు



శిరివెళ్ల- చిన్న కంబలూరు మెట్ట రోడ్డు

శిరివెళ్ల: మండలంలోని ప్రధాన రోడ్లు గుంతలమయంగా మారాయి. చిన్న పాటి వర్షాలకే చెరువులను తలపిస్తున్నాయి. మండల కేంద్రం శిరివెళ్ల నుంచి రుద్రవరం వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు శిరివెళ్ల – చిన్న కంబలూరు మధ్యలో గుంతలు పడి ప్రయాణానికి ఇబ్బందిగా మారింది. అలాగే శిరివెళ్ల మెట్ట నుంచి గోస్పాడు మండలం యాళ్లూరు వరకు 8 కిలో మీటర్ల వరకు అర్‌అండ్‌బీ రోడ్డు ఉంది. అందులో మెట్ట నుంచి కేసీ కెనాల్ కట్ట వరకు ఉన్న 6 కిలో మీటర్ల వరకు రోడ్డు అడుగు అడుగునా గుంతలే. ఈ రోడ్డు పై ప్రయాణించాలంటే నరకయాతనే. వర్షం పడినప్పుడల్లా గుంతలలో నీరు నిలిచి మడుగులను తలపిస్తున్నాయి. రోడ్డు విస్తర్ణకు గత ప్రభుత్వ రూ. 23 కోట్లు మంజూరు చేసింది. అయితే కాంట్రాక్ట్ పనులలో జాప్యం చేశాడు. ఈ లోగా ప్రభుత్వం మారిపోయింది. ఇదిలా ఉండగా రోడ్లపై గుంతలు పూడ్చడానికి కూటమి ప్రభుత్వానికి వంద రోజులు సరిపోవా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కొత్త రోడ్లు ఏమో గాని ఉన్న గుంతలు పూడ్చేటే చాలని కోరుతున్నారు.

మండల పరిషత్‌లో బదిలీలు

ఉయ్యాలవాడ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న పలువురు అధికారులు బదిలీ అయ్యారు. ఈఓపీఆర్‌డీ మహిధర్‌రెడ్డి గడివేముల మండలానికి, పీఆర్ ఏఈ రామకృష్ణారెడ్డి నంద్యాలకు బదిలీ అయ్యారు. అలాగే మాయలూరు పంచాయతీ కార్యదర్శి సురేష్‌బాబు సంజామల మండలంలోని గిద్దలూరు సచివాలయానికి, కొండుపల్లె కార్యదర్శి స్వర్ణకుమార్ నంద్యాలకు, హరివరం కార్యదర్శి బండి రాజశేఖర్ మండలంలోని పెద్దయమ్మనూరు సచివాలయానికి బదిలీ అయ్యారు. అలాగే మాయలూరు సచివాలయానికి సంజామల మండలంలోని ముదిగేడు కార్యదర్శి వెంకట దివాకర్‌రెడ్డి, బనగానపల్లె మండలం యాగంటిపల్లె నుంచి హరివరం సచివాలయానికి స్వర్ణలత, దొర్నిపాడు మండలం కొండాపురం నుంచి కొండుపల్లె సచివాలయానికి సుమిత్రను బదిలీ చేశారు. తుడుమలదిన్నె మహిళా పోలీస్ శిరివెళ్ల మండలం కోటపాడుకు, ఉయ్యాలవాడ సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంటు మోహన్ తుగ్గలి మండల కేంద్రానికి బదిలీ అయినట్లు మండల పరిషత్ కార్యాలయానికి గురువారం ఉత్తర్వులు అందాయి.

పంచాయతీ కార్యదర్శుల బదిలీ

శిరివెళ్ల: మండలంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు బదిలీ అయ్యారు. జీనేపల్లె పంచాయతీ కార్యదర్శి మునెయ్య ఆళ్లగడ్డ మండలం మిట్టపల్లెకు, కోటపాడు కార్యదర్శి షరీఫా బేగం దొర్నిపాడు మండలం గుండుపాపలకు, యర్రగుంట్ల కార్యదర్శి వెంకటేశ్వర్లు బేతంచెర్ల మండలం సిమెంట్ నగర్‌కు బదిలీ అయ్యారు. బోయలకుంట్ల పంచాయతీ కార్యదర్శి నరసింహ్మ వర్మ భరద్వాజను రుద్రవరం మండలం కోటకొండకు బదిలీ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులిచ్చారు. అయితే పింఛన్ల పంపిణీ పూర్తియిన అనంతరమే కార్యదర్శులు రిలీవ్ కావాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఉపాధి నిధులు మంజూరు

శిరివెళ్ల: మండలానికి ఉపాధి నిధులు మంజూరయ్యాయి. 2023- 24 ఆర్థిక సంవత్సరంలో మండలంలో రూ. 5.60 కోట్ల మేరకు ఉపాధి పనులు జరిగాయి. పనులకు సంబంధించి మెటీరియల్ కాంపోనెంట్ కింద గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల అయ్యాయి. మండల కేంద్రం శిరివెళ్లకు రూ. 42 లక్షలు, యర్రగుంట్ల రూ. 35 లక్షలు, కోటపాడు రూ. 10 లక్షలు, వెంకటాపురం, వీరారెడ్డిపల్లెకు రూ. 8 లక్షలు చొప్పున కేటాయించారు. చెన్నూరు రూ. 21 లక్షలు, మోత్కలపల్లె రూ. 13 లక్షలు, గుండంపాడుకు రూ. 15 లక్షలు, బోయలకుంట్ల రూ.20 లక్షలు, వనికినిదిన్నె రూ.8 లక్షలు, జీనేపల్లె రూ. 10 లక్షలు, గుంప్రమాన్‌దిన్నె పంచాయతీకి రూ.35 లక్షలు, మహదేవపురానికి రూ. 20 లక్షలు మంజూరయ్యాయి. నిధులతో సిమెంట్ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణాలు చేపట్టడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన



వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త

శ్రీశైలంప్రాజెక్ట్: ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుర్థులకు గురువారం సున్నిపెంటలోని బయో డైవర్సిటీ లాబోరేటరీలో వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, సైన్స్ విద్యార్థుర్థులు ఎకోలాజికల్ పార్క్‌లో కలుపు, పిచ్చి మొక్కలను తొలగించారు. అనంతరం బయోడైవర్సిటీ లాబోరేటరీలో అసిస్టెంట్ కన్జర్వేటర్ ధనరాజ్, ల్యాబ్ సైంటిస్ట్ ఎం.రమేష్, ఎఫ్ఎస్ఓ నాగూనాయక్, అధ్యాపకులు డాక్టర్.వి.అబూబకర్, ఎం.రాజు పర్యావరణంపై విద్యార్థులకు పలు అంశాలు తెలియజేశారు.

3 నుంచి దేవీ శరన్నవరాత్రులు



ఆహ్వాన పత్రికను విడుదల చేస్తున్న ఆర్యవైశ్య సభ సభ్యులు

చాగలమర్రి: మండల కేంద్రంలో వెలసిన శ్రీమత్కన్యకాపరమేశ్వరిదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు అక్టోబరు 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు ఆర్యవైశ్య సభ పాలక వర్గం అధ్యక్షుడు వంకదార లక్ష్మణబాబు తెలిపారు. గురువారం శ్రీమత్కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో శరన్నవరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రికను విడుదల చేశారు. లక్ష్మణబాబు మాట్లాడుతూ దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు అక్టోబరు 3 నుంచి 14వ తేదీ వరకు 11 రోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య, హిందూ సోదర, సోదరీ మణులందరూ పాల్గొన్ని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ ఉపాధ్యక్షుడు టి.మల్లికార్జున, బచ్చు సుబ్రహ్మణ్యం, ఉప కార్యదర్శులు జ్వాలా నరసింహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



సంప్రదాయ నృత్యం ప్రదర్శిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా గురువారం హైదరాబాద్‌కు చెందిన రాగరమ్య కల్చరల్ ఆర్గనైజేషన్ వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ఈ సంప్రదాయ నత్య ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మహాగణపతిం, మూషికవాహన, గణేశ పంచరత్నం, అదిగదిగో శ్రీశైలం, శివతాండవం, నమఃశివాయతే, అఖిలాండేశ్వరి, శివస్తుతి, దేవీస్తుతి తదితర గీతాలకు లాస్య, వాణిపద్మజ, పుష్పలత, కోమలి, సాయిసుధ, శివ, ఆశాజ్యోతి, పల్లవి, గౌతమి తదితరులు నృత్యాలు ప్రదర్శించారు.

ప్రజలు భయాందోళన చెందొద్దు

- తిమ్మరాజు కట్ట రివెట్‌మెంట్‌ను పరిశీలించిన ఎస్ఈ వర ప్రసాద్



కట్ట కింద లీకేజీ అవుతున్న ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎస్సార్‌బీసీ డివిజనల్ ఎస్ఈ వరప్రసాద్

అవుకు: మండల కేంద్రం అవుకు, చెర్లోపల్లె రహదారిలో ఉన్న తిమ్మరాజు చెరువు కట్ట రివెట్‌మెంట్ కుంగిన విషయం తెలిసిందే. ఈ మేరకు గురువారం ఎస్సార్‌బీసీ డివిజినల్ ఎస్ఈ వర ప్రసాద్ కుంగిన కట్టతోపాటు కట్టకింద నీరు లీకేజీ అవుతున్న ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్.ఈ మాట్లాడుతూ ఇరవై ఏళ్ల కిందట అవుకు మూడు చెరువులను అనుసంధానం చేస్తూ అవుకు రిజర్వాయర్‌ను నిర్మించారని, తిమ్మరాజు చెరువు కట్ట పాత స్లూయిస్‌ను తీసేసి నూతన స్లూయిస్‌ను కట్ట చివర్లో ఏర్పాటు చేసామన్నారు. రిజర్వాయర్‌లో పూర్తిస్థాయిలో(4.148 టీఎంసీ సామర్థ్యం) నీటిని నిల్వ ఉంచడంతో చెరువు కట్ట రాతికట్టడం (రివెట్‌మెంట్) కొద్ది మేరా కుంగిందని, అయితే ఎలాంటి ప్రమాదం లేదని తెలిపారు. కుంగిన ప్రదేశంలో మట్టితో, గులకరాళ్లతో కప్పేసామన్నారు. రిజర్వాయర్‌లో నీటిని తగ్గించటానికి చర్యలు చేపట్టామన్నారు. జీఎన్ఎస్ఎస్, ఎస్సార్‌బీసీ కాలువల ద్వారా 6వేల క్యూసెక్కుల నీరు రిజర్వాయర్‌లోకి వస్తుంటే చెర్లోపల్లె సమీపంలోని గేట్ల ద్వారా గండికోటకు 12వేల క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 4టీఎంసీల నీరు ఉందని, 3.5 టీఎంసీల వరకు తగ్గించి రివెట్‌మెంట్, నీటి లీకేజీ మరమ్మత్తుల పనులు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో అవుకు ఎస్సార్‌బీసీ ఈఈ సురేష్‌బాబు, డీఈఈలు, జేఈలు పాల్గొన్నారు.



గుండంపాడులో ఆరబోసిన మొక్కజొన్న దిగుబడులు

పంటలకు తుపాన్ల దెబ్బ

శిరివెళ్ల: ఈ ఖరీఫ్‌లో వరుస తుపాన్లు రైతన్నను ఆందోళనకు గురి చేస్తున్నాయి. సీజన్ ఆరంభంలో సాగుచేసిన ఆరుతడి పంటలు, మినుము, పెసర, మొక్క జొన్న నేడు చేతికొస్తున్నాయి. వరుసగా వర్షాలు కురవడంతో నష్టాలు మొదలయ్యాయి. మండలంలో గుంప్రమాన్‌దిన్నె, జీనేపల్లెలలో సాగు చేసిన మినుము పంట వర్షాలకు దెబ్బతిని ఎకరాకు కేవలం 2 కింటాళ్లు కూడా దిగుబడి రాలేదు. అలాగే మహదేవపురం, గుండంపాడు, గోవిందపల్లెలో సాగు చేసిన మొక్కజొన్న పంట గత వారం నుంచి కోతలు మొదలయ్యాయి. చేతికి వచ్చిన ధాన్యాన్ని పొలాలు, రోడ్ల వెంట ఆర బెట్టుకుంటున్నారు. వర్షాలు కురువడం, ఆకాశం మేఘావృతం కావడం వంటి పరిస్థితులతో రైతాంగం మరింత ఆందోళన చెందుతుంది. ధాన్యం తడిస్తే ధర తగ్గిపోతుందని, వ్యాపారులు అడిగిన ధరకే విక్రయించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.